

# కాంక్ష

**వి. సురేష్ చంద్ర**



అతని పేరేమిటో ఎవరికీ తెలియదు. కానీ సన్యాసి. జనందృష్టిలో సర్వం తెలిసిన ముని. కాబట్టి మనం అతన్ని 'ఋషి' అని పిల్చుకుందాం. ఆమె పేరేమిటో కూడా తెలియదెవరికీ. కానీ లావణ్యవతి. ప్రేమమయి. జీవితాన్ని సంతృప్తికరంగా అనుభవించాలనే ఆరాటం కలది. ఈమెను కన్య అని అందాం.


ఋషికి ఎప్పుడూ దైవమే లోకం. బోధనలే ప్రపంచం. ఐతిహ్యాసారమే ఆహారం. అతని దృష్టిలో శరీరం అశాశ్వతం. అనుపయోగం. శారీరక లావణ్యం అనేది వట్టి భ్రమ అని అతని భావన. మనసే స్థిరమైనదనీ, జరామరాలు లేనిదనీ అతని నమ్మకం. దైవమే అతని లక్ష్యం. దైవ సాన్నిధ్యమే అతనికి సంతృప్తికరమైన విషయం. పృకృతిని తప్ప, దేవుడిని తప్ప మరొకరిని ఆస్వాదించటం వల్లకాని పని అతనికి.

వీటన్నింటికీ పూర్తి విరుద్ధమయినట్లే కన్యస్థితి. ఆమెకు శరీర లావణ్యమే శాశ్వతం. ఆరోగ్యా నందాలకు నిలయం శరీరం అంటుంది. కన్యకి ఋషిని చూడకుండా ఉండగలగటం అసాధ్యం. అతనే లోకమనీ, అతనిప్పుడూ తన ముందుండాలనీ ఆమె ఆశ. ఋషికి కన్యను చూస్తూ గడపగల గడం అసాధ్యం. ఆమెకెప్పుడూ దూరం కావాలనేదే అతని ఆశ. ఆమె వెంబడిస్తుంది. అతను దొరకడు. ఆమె వదిలిపెట్టదు. అతడు తన పట్టు వదిలిపెట్టడు.

ఒక ముహూర్తం కలిసొచ్చింది. ఋషిని పట్టుకుంది కన్య. ఇలా అడిగింది.

"ఎవ్వడూ నాకు దొరక్కుండా

తప్పించుకుంటావే?
సమాధానం చెప్పలేదతను.
"నేనంటే అయిష్టమా?"
"శారీరక సౌందర్యమంటేనే అయిష్టం." చెప్పాడతను.
ఎందుకన్న ప్రశ్న ఆమెనుంచి.
"శారీరక లావణ్యమన్నది వట్టి భ్రమ. శరీరమంటే ఏమిటి? రక్తం, ఎముకలు, మాంసం, చర్మాల మిశ్రమం. వ్యాధులకీ, బాధలకీ, మృత్యువుకీ నిలయం" అతన్నుంచి జవాబు. ఆమె సమర్థించదతన్ని.
"శారీరక లావణ్యం అనేది భ్రమ కాదు, నిజం. రక్తమాంసాల కలబోత మాత్రమే కాదు శరీరం. వాటన్నింటి అందమయిన కూడిక శరీరం. ఆ కూడిక మూలం గానే శరీరానికి కాంతి, లావణ్యం, దృశ్య, శ్రవణ, స్పర్శ సుఖాలొస్తాయ్. విడదీసి చూస్తే దేనికీ పూర్ణ సుందరత్వం ఉండదు. తామర లోనూ విడదీస్తే అందం ఉండదు" అంటుందామె.
"కావచ్చు కానీ వీటన్నింటి కలయికే శరీరమయితే దానికి పూర్ణోపయోగం, లక్ష్యం సిద్ధించేది భగవంతుని సాన్నిధ్యంలోనే. శరీరానికి మోక్షం కావాలంటే దైవాన్నాశ్రయించక తప్పదు దైవభక్తి, గానం లేని మానవ జీవితం నిరుపయోగం. రక్త మాంసాల శరీరానికి దైవాన్ని కీర్తిస్తూ పాడే రాగంలోనే మోక్షం లభిస్తుంది. అన్నింటికీ దైవమే మూలం. ఐహిక జీవనం అంతా సమస్యల మయం. మోక్ష మార్గం కోసం చేసే ప్రయత్నమే పరిష్కారం" అంటాడతను.
"జీవమున్నప్పుడే లభించని మోక్షం జీవం సమాప్తమయ్యాక దేనికీ? మనమేమైనా చూడొచ్చామా మన పూర్వీకులేమైనా నీవన్న అపూర్వ సౌందర్యం, మోక్షమార్గం తిలకిస్తున్నట్లు నీక్కనిపిస్తోందా? జీవితమున్నప్పుడే అనుభవించని సుఖాలు మోక్షం తర్వాత ఎలా వస్తాయి చెప్పు. నీదంతా వట్టి భ్రమ. నీ మోక్షమనే ఆలోచనలు కట్టిపెట్టు. నావైపు చూడు. ఈ సౌందర్యం నిన్ను మత్తెక్కించడం లేదూ? నిజం చెప్పరా నీ కోసమే ఈ లావణ్యం. నా సర్వమూ నీకే అంకితమిస్తున్నాను. జాగు చేయకుండా నా కాంక్ష తీర్చు. శారీరక సౌందర్యాన్ని అనుభూతుల మధ్య ఆస్వాదిద్దువుగానీ." అంటూ చేతులు చాపింది కన్య. ఋషి అంటాడప్పుడు.
"నీదంతా పిచ్చి. జీవిత లక్ష్యమైన మోక్షాన్ని సాధించేందుకు నీకీ నీచమయిన మార్గమే దొరికిందా? నగ్న దేహాల వ్యర్థమైన కలయికలో ఏం ఆనందముంటుంది? నీది గుడిప్రేమ. అనహ్యమయిన జీవనరీతి. నువ్వు జీవిస్తున్నది మాయలో. ఆ మాయ విడిచిపెట్టు. ఇలా రా.స్వర్గ సుఖాల్ని మించిన మోక్ష సాధన కోసం విశ్వాన్ని ప్రేమిద్దాం."



'నాది కాదు మాయా ప్రపంచం? నువ్వే మాయలో జీవిస్తున్నావు. నా వాస్తవమంతా నీకు మాయలో గోచరిస్తోంది. ఆ మాయను ఛేదించేందుకే నేనొస్తున్నాను. నా శరీరాన్నే అస్త్రంగా నీలోని మాయను భద్రం చేస్తాను" ' అంటుందామె.
అయినా అంగుళమయినా చలించలేదు ఋషి.
"నువ్వనేదంతా మూఢత్వం. సృష్టిలోని అందమంతా మోక్షం కోసమే కావచ్చు. కానీ శారీరక సౌందర్యం మాత్రం మోక్షానికి దారి చూపదు. మానసిక స్థిరత్వమూ, దైవ బోధనల శ్రవణమే మోక్షసాధనకి దగ్గరి మార్గాలు. నువ్వురా. దైవ భజన స్రవంతిలో కలిసిపో. భగవంతుని సాన్నిధ్యం కోసం పూజిద్దాం. ఈ శరీర విసర్జనం తర్వాత అంతా మోక్షమే. అంతా సుఖాలసీమే. ఏముందనలీ శరీరంలో? సమస్యల సుడిగుండాలూ, బాధల దావానలాలూ తప్ప. విశ్వాన్నంతటినీ ప్రేమించటంలో వున్న ఆనందంవ్యక్తిగత ప్రేమనీ ప్రేమించ టంలో, శారీరకసౌందర్యాన్ని ఆరాధించడంలో ఎక్కడిది?" జ్వలించబోయీ ఆగుతుంది కన్య మళ్లీ మొదలు పెడుతుంది.
"బాధలకీ, వ్యాధులకీ మాత్రమే శరీరం **మయితే నేనొప్పుకోను. అది ఆరోగ్యానికీ,** అనారోగ్యానికీ కూడా నిలయమే. శరీరం ఏదో ఒక నాటికి క్షీణించి మరణిస్తుంది. సుందరమైన వస్తువుల అస్తమయాన్ని మనం అస్వాదించగలమ్మా లేదు కదా అలాగే ప్రపంచానికంతటికీ సుందర వస్తువైన శరీరం పూర్ణ లావణ్యంతో తొణికిసలాడుతున్నప్పుడు దానిని ద్వేషించటం అనేదే ఒక పెద్ద వ్యాధి. ఒక దారుణ బాధ. ఒక భీకర మృత్యువు. కనుక ఇప్పటికయినా ఆలోచించు. శరీర సౌందర్యమే వాస్తవ మయిన మోక్షానికి దగ్గరి మార్గం. భగవంతుని పూజవలన బూడిద రాలుతుందే తప్ప మోక్షం లభించదు. నువ్వన్న మోక్షం మానసికంగా కాకుండా శారీరకంగా కూడా లభిస్తుంది. త్వరపడి రా. మనం ఒకరిలో ఒకరం ఐక్యమవుదాం. ప్రపంచపు అంచులు దాటి మోక్షంకోసం ప్రయత్నం చేద్దాం."
అతనికిష్టమైన మోక్షమనే పదాన్ని వాడుతూ ప్రసంగం చేసిందామె. ఆమె వివరించిన సృష్టి పరిశీలనంతా అతనికి వ్యర్థంలా కనపడుతుంది. ఆమె వినిపించిన జీవన గానం అతనికి శోక సంగీతంలా విన్పిస్తుంది. మృత్యు గీతంలా ధ్వనిస్తుంది. ఎంత ప్రయత్నం చేసినా ఇంకా పట్టు నుంచి తప్పించుకుంటున్న ఋషి మీద ఆమెకు కోపంతో పాటు తాపమూ పెరిగి పోయింది. మళ్లీ నడక ప్రారంభించాడు ఋషి. మళ్లీ కన్య వెంబడించింది. అతడు పరుగిడటం మొదలుపెట్టాడు. ఆమెను

ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిదనే ఉద్దేశ్యంతో వరుగు మొదలెట్టాడు. ఋషి మీద ఆమెకు సౌమనస్యం పెరిగే కొద్దీ ఆమె మీద అతనికి వైమనస్యం ఎక్కువ కాజొచ్చింది.

తన లక్ష్యం కోసం ఆమె అతన్ని వదలకుండా వెంబడిస్తుంది. తన కాంక్ష తీర్చమని వేధిస్తుంది. అతడిని తన కౌగిట్లోకి తెచ్చుకోవాలని ఆమె కోరిక. అదామెకు స్వర్గమని ఆమే భావన. ఆమె కౌగిలి అతనిక్కి నరకప్రాయం. ఆమెకు సాధ్యమయినంత దూరం కావటమే అతని కోరిక. ఆమె అతడిని సమీపించిన కొద్దీ అతడు వేగం హెచ్చిస్తున్నాడు. కొండలు, అడవులు, కారడవులు దాటి పరిగెత్తుతున్నాడతను. అయినా లెక్క చేయకుండా వెంటపడిందామె. తిరిగితిరిగి అతనో ఆశ్రమం లోకి చొరబడతాడు. ఇక రక్షణ మార్గంలేక అక్కడున్న ఒక బృహ్మాండమయిన కంచు గంట క్రిందకు చేరతాడు ఋషి. ఆమె ఆ గంటలో దూరజాలక గంట చుట్టూ పరిభ్రమిస్తూ అందులోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుంది. అప్పటికే ఆమెలోని తృష్ణ మండిమండి ఉష్ణం అధికమై ఆ కోరికలోని ఉగ్రతకి ఆ కంచుగంట కరిగిపోయింది. ఆ ఉష్ణ ద్రవంలోనే ఋషి శాశ్వత సమాధి చెందుతాడు. చివరికి ఇద్దరికీ మోక్షం లభించలేదు.

శారీరక సౌందర్యం కోరికలో ఆమె దగ్ధమైంది. ఆమె తృష్ణాగ్నికి అతడు దగ్ధమయ్యాడు. "కాంక్ష" చివరికి ఇద్దరినీ జయించలేకపోయింది.

(ప్రాచీన జపాను జానపద సాహిత్యంలోని ఒక కథకి జపానీ అద్భుత చిత్రకారుడు కోకి 'కొబయాష్ చిత్రించిన అపూర్వ చిత్రానికి అనువాదం. కథ పరిచయం చేసిన ప్రసిద్ధ విమర్శకులు డా. సంజీవదేవ్ గారికి కృతజ్ఞతలతో అంకితం.)

●

